
రంజాన్ వేళలు

ఇఫ్తార్: బుధవారం సా: 6.33 గం.

సహర్: గురువారం ఉ: 4.58 గం.



చెరువులకు చెర..!

..కుంటలు కబ్జా

దర్జాగా ఆక్రమణ.. ప్లాట్లు విక్రయం

ఖాళీ స్థలాలకు ఇంటి నంబర్లు

సంగారెడ్డి టౌన్, మార్చి 18: జిల్లా కేంద్రమైన సంగారెడ్డికి కూతవేటు దూరంలో చెరువు, కుంటలు ఆక్రమణలకు గురయ్యాయి. కొందరు నాయకులు వాటిని చెరపట్టారు. చెరువు, కుంటల ప్రాంతాల్లోని ఎఫ్‌టీఎల్‌ను దర్జాగా ఆక్రమించి, అడ్డంగా రాతి స్తంభాలు ఏర్పాటు చేశారు. ఏకంగా ఓ కంట శిఖం భూమిలో ప్లాట్లు చేసి.. ఇళ్లు నిర్మించుకున్నట్లు.. వాటికి ఇంటి నంబర్లు ఇచ్చేశారు. మరో కుంటలో వ్యవసాయం పేరుతో ఆక్రమించుకుని, తమ అధీనంలోకి తీసుకున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం అటు వైపు కన్నెత్తి చూడటం లేదు. ముఖ్యంగా జిల్లా కేంద్రానికి సమీపంలోని ఆరుట్ల రామసానికుంట, మల్లన్నగారికుంట, గంగవానికుంటలు కబ్జా కోరల్లో చిక్కి ఉనికిని కోల్పోతున్నాయి.

పెద్ద చెరువులో ప్లాట్లు

ఆరుట్ల గ్రామ శివారులో పెద్ద చెరువు సర్వే నంబర్ 159లో 112.20 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఇందులో 92.20 ఎకరాలు పట్టా భూములు ఉన్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఈ భూముల పట్టాదారులు చెరువులో నీరు లేని సమయంలో సాగు చేసుకోవడానికి మాత్రమే అర్హులు. కానీ, కొందరు ఈ భూమిలో మట్టి, మొరం పోసి ప్లాట్లుగా మార్చారు. తమ స్థలం సరిహద్దులంటూ రాతి స్తంభాలను ఏర్పాటు చేశారు. ప్లాట్లకు రేట్లు కట్టి విక్రయిస్తున్నారు. చెరువు శిఖంలో సుమారు రూ. 20 కోట్ల విలువ చేసే భూమిని కొందరు కబ్జాదారులు విక్రయానికి పెట్టినట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

సిద్దమ్మ కుంట కబ్జా

సర్వే నంబర్ 31లోని సిద్దమ్మ కుంట మొత్తం 14.31 ఎకరాల్లో ఉంది. ఇక్కడ ఎకరం రూ. 2 కోట్ల విలువ ఉండగా, ఈ కుంట శిఖంలోని సుమారు నాలుగు ఎకరాలను కొందరు కబ్జా చేశారు. చెరువు శిఖంలో ప్లాట్లు చేసి, గజం రూ. 12 వేల చొప్పున విక్రయిస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

మల్లంగారి కుంటను మింగేశారు

గ్రామానికి సమీపంలోని మల్లంగారి కుంటను గ్రామానికి చెందిన ఓ నాయకుడు కబ్జా చేశాడు. 467 సర్వే నంబర్‌లో 17 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ కుంటను పట్టాభూమిగా తప్పుడు రికార్డులు సృష్టించి.. దర్జాగా కబ్జా చేశారు. కుంటలో మొరం పోసి నింపేశాడు. తర్వాత పాట్లుగా మార్చి.. అక్కడ కొన్ని తాత్కాలిక నిర్మాణాలు చేసి, ఇంటి నంబర్లు కూడా పొందటం గమనార్హం.

గంగవాని కుంట

ఆరుట్ల గ్రామ శివారులో ఉన్న గంగావాని కుంట 484 సర్వే నెంబర్‌లో 7.4 ఎకరాల విస్తీరణంలో ఉండగా కొంతమంది నాయకులు రెండున్నర ఎకరాలు ఆక్రమించారు. ఇక్కడా తాత్కాలిక ఇండ్లు నిర్మించి ఇంటి నంబర్లను కూడా పొందారు. ఈ కుంట పక్కనే ఉన్న రామసానికుంట సైతం ఆక్రమణకు గురైంది. 16.15 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ కుంటలు ఆరు ఎకరాల శిఖం భూమిని కబ్జా చేశారు. ఇక్కడ ఎకరం భూమి సుమారు రూ.1.50 కోట్లు పలుకుతోంది.

చోద్యం చూస్తున్న అధికారులు

ఆరుట్ల గ్రామ శివారులో ఇరిగేషన్ శాఖ అధీనంలోని నాలుగు కుంటలు, ఒక చెరువు కబ్జాకు గురైనప్పటికీ అధికారులు చోద్యం చూస్తున్నారనే విమర్శలున్నాయి. ఆయా కుంటల్లో మొరంతోపాటు రోడ్లు వేసి ప్లాట్లుగా మార్చి అమ్మేశారు. ఈ ప్లాట్లలో ఇళ్లు నిర్మించుకున్నట్లు రికార్డు సృష్టించి గ్రామ పంచాయతీ నంబర్లు పొందుతున్నా అధికారుల అటువైపు కన్నెత్తి చూడకపోవడం వెనుక కారణాలు తెలియడం లేదు. ఈ కబ్జాలపై ఫిర్యాదు చేసినా పట్టించుకునేవారే లేరని గ్రామస్థులు ఆరోపించారు.



సిద్దమ్మకుంట శిఖం భూమిలో ఏర్పాటు చేసిన రాతి స్తంభాలు



పెద్దచెరువు శిఖం భూమిలో ఫెన్సింగ్



నిజాంపేటలో నేలకొరిగిన మొక్కజొన్న పంట

వడగళ్ల బీభత్సం

- అకాల వర్షాలకు అపార నష్టం
- మూడు మండలాల్లో వందలాది ఎకరాల్లో నేలకొరిగిన వరి, మొక్కజొన్న
- సుమారు 1,600 ఎకరాల పంట నష్టం

మెదక్/రామాయంపేట/నిజాంపేట, మార్చి 19: జిల్లాలో ఈదురుగాలులతో కూడిన వడగళ్లవాన బీభత్సం సృష్టించింది. పంటలకు పెద్దఎత్తున నష్టం వాటిల్లింది. రామాయంపేట, నిజాంపేట, చేగుంట మండలాల్లో సోమవారం రాత్రి ఈదురుగాలు, వడగళ్ల వానకు వరి నేలకొరిగింది. మామిడికాయలు నేల రాలాయి. మొక్కజొన్న పంట దెబ్బతిన్నది. ఆరుగాలం శ్రమించి పండించిన పంటలు వర్షార్పణం కావడంతో రైతులు కంటతడి పెడుతున్నారు. సుమారు 1647ఎకరాల విస్తీర్ణంలో పంటనష్టం జరిగినట్లు వ్యవసాయ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. అత్యధికంగా 1,399 ఎకరాల్లో వరి, 221 ఎకరాల్లో మొక్కజొన్న దెబ్బతిన్నాయి. 15 ఎకరాల్లో మామిడి తోటల్లో కాయలు నేలరాలాయి. పదెకరాల్లో కూరగాయ పంటలు కూడా దెబ్బతిన్నట్టు వ్యవసాయ అధికారులు పేర్కొన్నారు. అయితే, అధికారుల అంచనాల కంటే ఎక్కువ నష్టం జరిగిందని రైతులు వాపోతున్నారు. రైతులవారీగా క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు. పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటాం మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ పేర్కొన్నారు.



నిజాంపేటలో నేలకొరిగిన మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు





నిజాంపేటలో నేలకొరిగిన వరిని పరిశీలిస్తున్న అధికారులు, నేలరాలిన వడ్లు

ఆన్‌లైన్ గేమ్స్ కోసం అప్పులు..

యువకుడి ఆత్మహత్య 7లో



మెదక్‌లో పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

రెండో రోజు ప్రశాంతంగా పరీక్షలు

సంగారెడ్డి అర్బన్/మెదక్ అర్బన్, మార్చి 19 : సంగారెడ్డి, మెదక్ జిల్లా పరిధిలో పదో తరగతి పరీక్షలు రెండో రోజు ప్రశాంతంగా కొనసాగాయి. మంగళవారం ద్వితీయ భాష హిందీ పరీక్ష జరిగింది. సంగారెడ్డి జిల్లాలోని 121 కేంద్రాల్లో 22,018 మంది విద్యార్థులకు 21,975 మంది హాజరయ్యారు. 99.8 శాతం హాజరు నమోదైనట్టు అధికారులు తెలిపారు. కంది మండలంలోని మూడు, పటాన్‌చెరు మండలంలోని రెండు పరీక్ష కేంద్రాలను డీఈవో వెంకటేశ్వర్లు తనిఖీ చేశారు. 35 కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు పరిశీలించాయి. జిల్లాలో ఎక్కడా కూడా మాల్ ప్రాక్టిస్ కేసు నమోదు కాలేదని డీఈవో తెలిపారు.

మెదక్ కలెక్టర్ తనిఖీలు

మెదక్ జిల్లాలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. మంగళవారం ఆయన మెదక్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు. పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. పరీక్షా కేంద్రంలోకి సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులను ఎట్టి పరిస్థితుల్లో అనుమతించవొద్దన్నారు. అనంతరం పిల్లికోటాల్‌లోని అద్దె భవనంలో కొనసాగుతున్న తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల డిగ్రీ కళాశాలను కలెక్టర్ సందర్శించారు. కాగా, జిల్లావ్యాప్తంగా 68 పరీక్షా కేంద్రాల్లో రెండోరోజు 10,298 మంది విద్యార్థులకు 10,275 మంది హాజరైనట్టు డీఈవో రాధాకిషన్ తెలిపారు.



సంగారెడ్డిలో నంబర్ చూసుకుంటున్న విద్యార్థులు

కార్ చిచ్చు

డైలమాలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

- పార్టీ మారక తప్పదా!
- బీఆర్ఎస్, కాంగ్రెస్‌లలో చర్చ
- మంత్రిని కలిసేందుకు యత్నం



ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, మార్చి 19 : మాజీ ముఖ్యమంత్రి సొంత జిల్లాగా చెప్పుకునే.. ఉమ్మడి మెదక్ జిల్లా 'కారు'లో చిచ్చు రగులుకుంది. గులాబీ పార్టీ తరఫున గెలిచిన పలువురు ఎమ్మెల్యేలు అధికార పార్టీలో చేరుతారనే ప్రచారం జోరుగా సాగుతున్నది. కాంగ్రెస్ అధికారం చేపట్టిన కొద్ది రోజుల్లోనే ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన నలుగురు ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి అభినందించిన విషయం తెలిసిందే. అనంతరం ఆ నలుగురు ఎంతగా వివరణ ఇచ్చినప్పటికీ బీఆర్ఎస్, కాంగ్రెస్‌లో చర్చ జరుగుతూనే ఉన్నది. సీఎం కలిసిన ఎమ్మెల్యేలు ఇప్పటికీ బీఆర్ఎస్‌లోనే ఉన్నప్పటికీ.. వారు ఏదో ఒక నిర్ణయం తీసుకోక తప్పని పరిస్థితి కనిపిస్తున్నది. రాజకీయాలతో పాటు వ్యాపారాలు చేస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు సమస్యల నుంచి బయటపడడానికి పార్టీ మార్పే పరిష్కారంగా కనిపిస్తున్నా.. నిర్ణయం తీసుకోవడంలో వెనకాముందవుతున్నట్టు తెలుస్తున్నది.

అయోమయం..

బీఆర్ఎస్‌కు చెందిన పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పరిస్థితి అయోమయంగా మారింది. ముచ్చటగా మూడోసారి గెలుపొందిన ఆయన ఇంతకాలం బీఆర్ఎస్ పాలనలో ఇష్టారాజ్యంగా వ్యవహరించారన్న విమర్శలున్నాయి. నియోజకవర్గంలో మహిపాల్‌రెడ్డి ఎంత చెబితే అంత అన్నవిధంగా సాగింది. అనూహ్యంగా ప్రభుత్వం మారడంతో ఆయనను సమస్యలు చుట్టుముడుతున్నాయి. అక్రమ మైనింగ్‌పై కేసు నమోదు చేసి ఆయన సోదరుడు మధుసూదన్‌రెడ్డిని అరెస్ట్ చేశారు. ప్రస్తుతం ఆయన రిమాండ్‌లో ఉన్నారు. ఈ సందర్భంగా మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ మెడపై కత్తి పెట్టి పార్టీ మారమంటే మారుతామా? అని వ్యాఖ్యానించడం చర్చకు తావిస్తున్నది. అరెస్ట్ చేసి ఐదారు రోజులవుతున్నా మధుసూదన్‌రెడ్డికి బెయిల్ రాలేదు. కారణాలు ఏమైనప్పటికీ ఎమ్మెల్సీ కవిత అరెస్ట్ సందర్భంగా పార్టీ పిలుపుమేరకు జరిగిన ఆందోళనల్లోనూ మహిపాల్‌రెడ్డి పాల్గొనలేదు. అనారోగ్యం వల్లే ఆందోళనలో పాల్గొనలేదని వివరించినా.. అదే రోజు సాయంత్రం జిన్నారం మండలం మదారంలో ఇళ్లు కోల్పోయిన బాధితులను పరామర్శించడం చర్చకు తావిస్తున్నది.

మంత్రి అపాయింట్‌మెంట్ కోరి..

ఇటువంటి పరిస్థితుల్లో ముందుకు వెళ్లడం ఎలాగో తెలియని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి మంగళవారం సంగారెడ్డిలో మంత్రి దామోదర్ రాజనర్సింహను కలవడానికి అపాయింట్‌మెంట్ తీసుకున్నా.. మీడియా ఉండడంతో విరమించుకున్నారు. మంత్రిని కలవడం కోసం మహిపాల్‌రెడ్డి మంగళవారం సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ క్యాంపు కార్యాలయానికి వచ్చారు. అక్కడికే జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు కూడా చేరుకున్నారు. తొలుత ఈ ముగ్గురు ఎమ్మెల్యేలు మంత్రి దామోదర్ రాజనర్సింహను కలవాలని భావించినట్టు తెలిసింది. అయితే, మంత్రి నివాసం వద్ద మీడియా ప్రతినిధులు ఉన్నట్టు తెలియడంతో ప్రయత్నం విరమించుకున్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో మంత్రి దామోదర్‌ను కలిసే ప్రతిపాదనను విరమించుకోవాలని చింతా ప్రభాకర్, మాణిక్‌రావులు.. మహిపాల్‌రెడ్డికి నచ్చజెప్పినట్టు తెలిసింది.



సీఎంను కలిసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు (ఫైల్)

ఆ ఇద్దరిదీ అదే దారి

ఇక ఉమ్మడి జిల్లాలోని మరో ఇద్దరు ఎమ్మెల్యేల పరిస్థితీ అలాగే ఉంది. ట్రాన్స్‌పోర్ట్ వ్యాపారంలో ఉన్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డిపై కాంగ్రెస్ దృష్టి సారించినట్లు తెలిసింది. ఆయన ట్రాన్స్‌పోర్ట్ వ్యాపారం గురించి వివరాలను అధికార పార్టీ నాయకులు సేకరిస్తున్నట్లు సమాచారం. కాగా, నర్సాపూర్ ఎమ్మెల్యే వి.సునితారెడ్డి నియోజకవర్గంలో ప్రొటోకాల్ సమస్యలు ఎదుర్కొంటున్నారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, ఇతర కాంగ్రెస్ నాయకులు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల్లో పాల్గొనడం, అధికారులు కూడా వారు చెప్పినట్టే వినడం ఎమ్మెల్యే సునితారెడ్డికి చికాకు కలిగిస్తున్నట్టు బీఆర్ఎస్ వర్గాలు తెలిపాయి. ఇటువంటి పరిస్థితుల్లో ఇద్దరు ఎమ్మెల్యేలు ఎటువంటి నిర్ణయం తీసుకుంటారోనన్న చర్చ రాజకీయవర్గాల్లో సాగుతున్నది. వీరి నిర్ణయం పార్లమెంట్ ఎన్నికలకు ముందు ఉంటుందా? తర్వాత ఉంటుందా? అనే ఆసక్తి నెలకొన్నది.

బీఆర్ఎస్‌లోనే కొనసాగుతా

జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

జహీరాబాద్, మార్చి 20: బీఆర్ఎస్‌లోనే కొనసాగుతానని, పార్టీని వీడే ప్రసక్తే లేదని సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు స్పష్టం చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలోనే కొనసాగుతానని చెప్పారు. కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు వస్తున్న వార్తలను ఆయన ఖండించారు. జహీరాబాద్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఎమ్మెల్యేలు రాజీనామా చేయకుండా పార్టీ మారితే రాళ్లతో కొట్టాలని అప్పట్లో అన్న సీఎం రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు గేట్లు తెరుస్తామని ఎలా అంటారని ప్రశ్నించారు. ఇతర పార్టీల నాయకులకు గేట్లు తెరవడం కాదు.. ప్రజలకు ఇచ్చిన హామీలకు గేట్లు తెరవాలని పేర్కొన్నారు.

చాపకింద నీరులా కుష్ఠు

- నివారణకు వైద్యఆరోగ్యశాఖ చర్యలు
- బాధితుల గుర్తింపునకు ప్రత్యేక బృందాలతో సర్వే

మెదక్ అర్బన్, మార్చి 19: మెదక్ జిల్లాలో కుష్ఠు చాపకింద నీరులా విస్తరిస్తున్నది. దీంతో, కుష్ఠు నివారణకు వైద్యరోగ్యశాఖ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఈ నెల 13 నుంచి 27 వరకు ఇంటింటి సర్వే చేస్తున్నది.

ఆరుగురు బాధితుల గుర్తింపు

ఇంటింటి సర్వే కోసం 554 మంది ఆశా కార్యకర్తలతో జిల్లా వ్యాప్తంగా 554 బృందాలను ఏర్పాటు చేశారు. ప్రతి రోజు గడప గడపకూ వెళ్లి సర్వే చేస్తూ.. అనుమానితులను గుర్తిస్తారు. జిల్లా స్థాయిలో జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి, కుష్ఠు నివారణ అధికారి పర్యవేక్షిస్తారు. గత వారం రోజులుగా 1,04,142 ఇళ్లల్లో 4,07,978 మందిని సర్వే చేయగా.. 620 మందిని అనుమానితులను గుర్తించారు. 6 కొత్త కేసులు నమోదు కాగా.. వెంటనే వారికి చికిత్సను ప్రారంభించారు.

తగ్గుముఖం పట్టని వ్యాధి

జిల్లాలో 2020-21లో 18 కేసులు, 2021-22లో 27 కేసులు, 2022-23లో 34 కేసులు 2023-24లో ఇప్పటి 24 కేసులు నమోదవగా.. కొత్తగా 6 కేసులు వెలుగు చూశాయి. ఇంకా వైద్య పరీక్షలు చేయించుకోని వారు వందల సంఖ్యలో ఉంటారు. వైద్య సిబ్బంది నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగానే కుష్ఠు బాధితుల గుర్తింపు సరిగా జరగడం లేదని ఆరోపణలున్నాయి. ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు వ్యాధిగ్రస్థులను గుర్తించి సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పంపించాల్సి ఉండగా.. ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు.

తొలి దశలో చికిత్సతో కట్టడి

లెప్రీ అనే మైక్రో బ్యాక్టీరియాతో కుష్ఠు సోకుతుంది. సకాలంలో వైద్యం చేయించుకోకపోతే వ్యాధి సోకిన 3 నుంచి 15 ఏళ్ల అనంతరం పరిణామాలు బయటపడుతాయి. తొలి దశలో వ్యాధిని నిర్ధారించుకొని ఎండీటీ చికిత్స తీసుకుంటే అంగవైకల్యం రాకుండా కాపడుకోవచ్చు. శరీరంలో ఎరుపు రంగు, రాగి రంగు, స్పర్శ లేని మచ్చలు ఉంటే వైద్యులను సంప్రదించాలి.



మెదక్‌లో ఇంటింటి సరే చేస్తున్న వైద్యసిబ్బంది, ఆశా కార్యకర్తలు (ఫైల్)

కుష్ఠురహిత జిల్లాయే ధ్యేయం



కుష్ఠు రహిత జిల్లాగా మెదక్‌ను తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టాం. జిల్లా వ్యాప్తంగా కుష్ఠు వ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వే పకడ్బందీగా నిర్వహిస్తున్నాం. అనుమానం ఉన్న వారిని ఉంటే సంబంధిత పీహెచ్‌సీలకు తీసుకెళ్లి పరీక్షలు చేయిస్తారు. శరీరంపై స్పర్శలేని మచ్చలు ఉంటే స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య పరీక్షలు చేయించుకోవాలి.

– శ్రీరామ్, డీఎంహెచ్‌వో, మెదక్

కొల్చారంలో 'రైతునేస్తం'పై వీడియో కాన్ఫరెన్స్



రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

కొల్చారం, మార్చి 19: కొల్చారం రైతువేదికలో రైతునేస్తం వీడియా కాన్ఫరెన్స్ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యానవన విశ్వవిద్యాలయ శాస్త్రవేత్త డాక్టర్ రాజశేఖర్ రైతులకు పలు సూచనలు ఇచ్చారు. సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, యాజమాన్య పద్ధతులను వివరించారు. వేసవిలో వివిధ కూరగాయ పంటల్లో వాడే పురుగు మందుల వివరాల గురించి ఎంటమాలజీ సైంటిస్టు డాక్టర్ కె.కవిత రైతులకు వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మండల వ్యవసాయాధికారి శ్వేతకుమారి, ఏఈవోలు అంబిక, వినీతభవాని పలువురు ఏఈవోలు పాల్గొన్నారు.

మహిళల రక్షణ కోసమే షీటీమ్ బృందాలు: అదనపు ఎస్పీ



జిల్లా షీటీమ్ బృందంతో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ మహేందర్

మెదక్ అర్బన్, మార్చి 19: బాలికలు, మహిళ రక్షణ కోసమే షీటీమ్ బృందాలు పనిచేస్తాయని మెదక్ అదనపు ఎస్పీ మహేందర్ పేర్కొన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు మంగళవారం జిల్లా షీటీమ్ బృందంతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవ్ టీజింగ్, బాల్య వివాహాలు, మహిళా రక్షణ, ఈతల వల్ల జరిగే ప్రమాదాలు, మూఢ నమ్మకాలు, చిన్నారులపై జరిగే నేరాలు వంటి విషయాలను షీటీమ్ బృందానికి వివరించారు. ఆకతాయుల నుంచి మహిళలకు ఇబ్బందులు ఎదురైతే వెంటనే 8712657963 నెంబరుకు ఫోన్ లేదా, వాట్సాప్‌లో మెసేజ్ ద్వారా ఫిర్యాదు చేయొచ్చన్నారు. ఫిర్యాదు అందుకున్న వెంటనే షీటీమ్ పోలీసులు బాధిత మహిళలకు అండగా నిలుస్తారని పేర్కొన్నారు.

దెగుల్‌వాడి వద్ద అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు




అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ చంద్రశేఖర్‌రెడ్డి

కంగ్టి, మార్చి 19: జిల్లా, రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన కంగ్టి మండల పరిధిలోని దెగుల్‌వాడి గ్రామం వద్ద పోలీసులు అంతర్రాష్ట్ర చెక్ పోస్టును ఏర్పాటు చేశారు. పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో కర్ణాటక, మహారాష్ట్రకు చేరువగా ఉన్న ఈ ప్రాంతం నుంచి డబ్బు, మద్యం, అక్రమ రవాణా జరగకుండా అడ్డుకట్ట వేసేందుకు చెక్ పోస్టును ఏర్పాటు చేశారు. కంగ్టి సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్ఐ విశ్వజన్ ఏర్పాట్లను పరిశీలించారు. చెక్ పోస్టు మీదుగా వచ్చి పోయే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి వివరాలు నమోదు చేసుకోవాలని సిబ్బందికి సూచించారు.




వెంకటాపూర్ శివారులో అసైన్డ్ భూముల్లో మట్టి తవ్వకాలు జరుపుతున్న దృశ్యం



మైనింగ్ అధికారులు జారీచేసిన తప్పుల తడకగా ఉన్న అనుమతి పత్రం

అసైన్డ్ భూముల్లో అక్రమ మట్టి తవ్వకాలు

- తప్పుల తడకగా అనుమతుల జారీ
- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న మట్టి మాఫియా
- ధ్వంసమవుతున్న చెట్లు, పట్టించుకోని అధికారులు

కొల్చారం, మార్చి 19: మెదక్ జిల్లా కొల్చారం మండలం దేవుని వెంకటాపూర్‌లోని అసైన్డ్ భూముల్లో మట్టి తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. ఈ మట్టిని పాపన్నపేట మండలం నాగ్సాన్‌పల్లి శివారు ప్రాంతమైన టేకులగడ్డ వరకు టిప్పర్లలో తరలిస్తూ డబ్బులు దండుకుంటున్నారు. ఓ పక్క అక్రమ మట్టి తవ్వకాలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతూ.. మరోపక్క ఇళ్ల నిర్మించుకునే వారికి పట్టా భూముల నుంచి మట్టిని తరలించేందుకు మార్గదర్శకాలు జారీచేసింది. దీన్ని ఆసరాగా చేసుకున్న కొంతమంది అసైన్డ్ భూముల్లో మట్టి తవ్వకాలు చేసుకునేందుకు దరఖాస్తు చేసుకోగా.. మైనింగ్ అధికారులు అందినకాడికి దండుకుని అడ్డగోలుగా అనుమతులు ఇచ్చారు.

వివరాలు లేని అనుమతి పత్రం

అధికారులు జారీచేసిన అనుమతి పత్రంలో సంబంధిత సర్వే మ్యాపు, ఎక్కడి నుంచి ఎక్కడి వరకు మట్టి తరలిస్తున్నారు.. వాహనాల నెంబర్లు, ఏ సమయం నుంచి ఏ సమయం వరకు మట్టిని తరలించవచ్చనే వివరాలు ఉండాలి. ఇవేమీ లేకుండానే ఇష్టారీతిన అనుమతులు ఇవ్వడం పలు అనుమానాలకు తావిస్తున్నది. కొల్చారం మండలం దేవుని వెంకటాపూర్ గ్రామంలోని సర్వే నెంబరు 30బై 29 అసైన్డ్ భూమిలో మట్టి తవ్వకునేందుకు అధికారులు అనుమతులు ఇచ్చారు. కానీ ఎక్కడి వరకు రవాణాకు అనుమతులు ఇచ్చారో పేర్కొనలేదు. 1000 మెట్రిక్ టన్నుల మట్టికి రూ.20 వేలు మాత్రం కట్టించుకున్నారు. అనుమతి ప్రకారం మట్టిని ఇళ్ల నిర్మాణాలకు మాత్రమే ఇవ్వాల్సి ఉండగా.. అందుకు విరుద్ధంగా వెంచర్లకు మట్టిని సరఫరా చేసేందుకు అనుమతులు ఇవ్వడం వెనక మతలబు ఏంటోనని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

నేలవాలుతున్న పచ్చని చెట్లు

ప్రభుత్వం అసైన్డ్ భూముల నుంచి మట్టిని తరలించేందుకు అనుమతి ఇవ్వడంతో వాటి పరిసరాల్లో ఉన్న పచ్చని చెట్లు ధ్వంసమవుతున్నాయి. వానాకాలంలో హరితహారం కింద నాటిన మొక్కలు కూడా మట్టి మాఫియా చేతుల్లో నేలవాలుతున్నాయి. మట్టి అక్రమ రవాణాపై పోలీస్, రెవెన్యూ అధికారులకు గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. గత శనివారం టాస్క్‌ఫోర్స్ అధికారులు మధ్యాహ్నం 1 గంటలకు వచ్చి మట్టిని తరలిస్తున్న టిప్పర్లను ఆపారు. మెదక్ నుంచి వచ్చిన టిప్పర్ యజమానులు టాస్క్‌ఫోర్స్ అధికారులతో మంతనాలు జరిపి, ముడుపులు అప్పజెప్పి టిప్పర్లను అక్కడి నుంచి వెళ్లేలా చేసుకున్నారు. దీంతో టాస్క్‌ఫోర్స్ అధికారుల తీరుపై ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఆన్‌లైన్ గేమ్స్ కోసం అప్పులు.. ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య



పవన్‌కళ్యాణ్ (ఫైల్)

కొండపాక, మార్చి 19: ఆన్‌లైన్ గేమ్స్ కోసం చేసిన అప్పులు తీర్చలేక జీవితంపై విరక్తి చెందిన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సిద్దిపేటలో జరిగింది. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట పట్టణానికి చెందిన మద్దెల పవన్‌కళ్యాణ్(26) జగదేవ్‌పూర్‌లో ఉన్న ఎంఎస్ఎన్ కంపెనీలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నెల 16న డ్యూటీకి వెళ్తున్నానని ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు ఫోన్‌చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చింది. బంధువుల వద్ద, స్నేహితుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. మంగళవారం తెల్లవారుజామున కొండపాక మండలం వేలికట్ట గ్రామ శివారులోని బాలాజీ కాటన్ మిల్లు సమీపంలో రైల్వేట్రాక్ వద్ద ఉరేసుకుని విగత జీవిగా పవన్‌కళ్యాణ్ కనిపించాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటుపడిన పవన్‌కళ్యాణ్ అప్పులు చేశాడు. వాటిని తీర్చలేక ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబీకులు తెలిపారు. తండ్రి పరమేష్ ఫిర్యాదు మేరకు కుకునూరుపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పరిశ్రమలో ప్రమాదం, కార్మికుడి మృతి



గోపాల్ మృతదేహం

పటాన్‌చెరు రూరల్, మార్చి 19: పాశమైలారం పారిశ్రామికవాడల్లోని ఐటీడబ్ల్యూ సిగ్నోడ్ పరిశ్రమలో మంగళవారం జరిగిన ప్రమాదంలో కార్మికుడు మృతిచెందాడు. బీడీఎల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముత్తంగి గ్రామానికి చెందిన కాంట్రాక్ట్ కార్మికుడు గోపాల్(40) విధి నిర్వహణలో ఉండగా.. పరిశ్రమలో ఆకస్మికంగా గోడ కూలింది. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసుల పేరు చెప్పి దారి దోపిడీ

- దంపతులను బెదిరించి బంగారం చోరీ

సంగారెడ్డి క్రైమ్, మార్చి 19: పోలీసులమని చెప్పి దారి దోపిడీకి పాల్పడిన సంఘటన సంగారెడ్డి మండలం ఫసల్‌వాది గ్రామ శివారులోని 161వ జాతీయ రహదారిపై మంగళవారం చోటు చేసుకున్నది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... పుల్కల్ మండలం చక్రియాల్ గ్రామానికి చెందిన విష్ణువర్ధన్‌రెడ్డి తన భార్య విజయతో కలిసి సంగారెడ్డి నుంచి చక్రియాల్‌కు మంగళవారం మధ్యాహ్నం బైక్‌పై వెళ్తున్నాడు. సంగారెడ్డి మండలం ఫసల్‌వాది గ్రామ శివారులోకి రాగానే రెండు బైక్‌లపై వచ్చిన నలుగురు వ్యక్తులు వారిని అడ్డగించారు. తాము పోలీసులమని వాహనాన్ని ఆపితే ఎందుకు ఆపడం లేదంటూ బెదిరించారు. అంతటితో ఆగకుండా తమ వద్ద ఉన్న కత్తిని చూపించి దంపతులను బెదిరించి విజయ మెడలో ఉన్న బంగారాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆమె మెడలో ఉన్న రెండున్నర తులాల నల్లపూసల దండ ఇచ్చింది. పుస్తెలతాడు కూడా ఇవ్వాలని బెదిరించగా అది రోల్డ్‌గోల్డ్ అని చెప్పడంతో వదిలేశారు. అనంతరం దుండగులు అక్కడి నుంచి పారిపోయారు. దుండగులు హిందీ, తెలుగు భాషలో మాట్లాడారని తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సంగారెడ్డి రూరల్ పోలీసులు తెలిపారు.

ఎలక్ట్రిక్ బైక్‌లో మంటలు



దగ్ధమవుతున్న ఎలక్ట్రికల్ వాహనం

సిద్దిపేట క్రైం, మార్చి 19: సిద్దిపేట పట్టణంలోని మోడ్రన్ బస్టాండ్ వద్ద మంగళవారం ఓ ఎలక్ట్రిక్ బైక్‌లో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. పట్టణానికి చెందిన నరేంద్ర తన ఎలక్ట్రిక్ బైక్‌పై పని నిమిత్తం బస్టాండ్ వద్దకు వచ్చి పార్కు చేశాడు. ఇంతలో బైక్ నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగి పొగ వ్యాపించింది. అదే సమయంలో బస్టాండ్ వద్ద విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ ఏఎస్ఐ ఉమేష్, హెడ్ కానిస్టేబుల్ సత్తయ్యగౌడ్, కానిస్టేబుల్ మహేష్, శ్రీనివాస్, అఖిల్, హోంగార్డు షాకీర్ వెంటనే నీటితో మంటలను ఆర్పేశారు. వేసవికాలంలో ఎలక్ట్రిక్ బైకుల పట్ల వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని పోలీస్ అధికారులు సూచించారు.

అక్రమ నిర్మాణాలకు నోటీసులతో సరి!

- తర్వాత మళ్లీ యథావిధిగా నిర్మాణాలు
- తూతూమంత్రంగా స్పెషల్ ఆఫీసర్ల పాలన
- కందిలో చర్చనీయాంశంగా మారిన నోటీసుల వ్యవహారం



కందిలో అక్రమంగా నిర్మిస్తున్న ఓ షెడ్డు వద్ద గోడకు నోటీసులు అంటిస్తున్న పంచాయతీ సిబ్బంది

కంది, మార్చి 19: సంగారెడ్డి జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న కందిలో రోజురోజుకు అక్రమ నిర్మాణాలు పెరిగిపోతున్నాయి. పంచాయతీ అధికారులు మాత్రం సదరు అక్రమ నిర్మాణాలకు నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకుంటున్నారు. తర్వాత మళ్లీ యథావిధిగా నిర్మాణాలు జరుగుతున్నాయని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. నెలన్నరగా స్పెషల్ ఆఫీసర్ల పాలన అమల్లోకి వచ్చినా.. కందిలో మాత్రం అక్రమ నిర్మాణాలు ఆగడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. పంచాయతీరాజ్ చట్టం 2018 ప్రకారం సెక్షన్ 113, 114 కింద జారీచేసిన అక్రమ నిర్మాణ నోటీసులు అభాసుపాలవుతున్నాయి. పంచాయతీ సిబ్బంది అక్రమ నిర్మాణాలు జరిగే చోటుకి వెళ్లి.. సదరు నిర్మాణానికి సంబంధించిన యజమానికి కాకుండా గోడలకు, బేస్‌మెంట్లను, షెడ్లకు నోటీసులు అంటించి వస్తున్నారు. మంగళవారం కూడా పంచాయతీ సిబ్బంది కంది శివారులోని లక్ష్మీనగర్ కాలనీ వద్ద అక్రమంగా నిర్మిస్తున్న ఓ ఫంక్షన్‌హాల్‌కు, మరో షెడ్డుకు నోటీసులు ఇచ్చారు. వారు వెళ్లగానే యజమానులు నోటీసులను పక్కన పడేసి నిర్మాణాలను కొనసాగించారు. రెండేళ్ల నుంచి కందిలో ఎన్నో అక్రమ నిర్మాణాలకు, మార్బుల్‌షాపులకు, ఫంక్షన్‌హాళ్లకు, దుకాణాలకు వందలాది నోటీసులు ఇచ్చినా ఫలితం శూన్యమని చెబుతున్నారు. దీన్ని బట్టిచూస్తే కందిలో స్పెషల్ ఆఫీసర్ల పాలన తూతూ మంత్రంగా జరుగుతుందని తెలుస్తున్నది. ఉన్నతాధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలు జరగకుండా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు మహర్దశ

- పీఎం-ఉషా కింద రూ.5 కోట్లు మంజూరు
- నిధులు మంజూరు పట్ల అధ్యాపకుల హర్షం



సంగారెడ్డిలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల

సంగారెడ్డి అర్బన్, మార్చి 19: సంగారెడ్డిలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు మహర్దశ పట్టనున్నది. ప్రధానమంత్రి ఉచ్చతర్ శిక్షా అభియాన్(పీఎం ఉషా-రూసా) కింద కళాశాలకు రూ.5 కోట్ల నిధులు కేటాయిస్తున్నట్టు పీఎం-ఉషా ప్రాజెక్టు ఆఫీసర్ డా.సౌందర్య జోసెఫ్ ప్రకటించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డా.అరుణబాయి తెలిపారు. తెలంగాణవ్యాప్తంగా 13 డిగ్రీ కళాశాలకు రూ.5 కోట్ల చొప్పున నిధులు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించగా, అందులో సంగారెడ్డి మహిళా డిగ్రీ కళాశాల ఉండడం విశేషం. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే మొత్తం గ్రాంటులో 40 శాతం నిధులు రాష్ట్రం మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వనున్నది. ఈ నిధులను కళాశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు వినియోగించనున్నారు. కళాశాలలో నూతన భవనాలు, ప్రహరీ నిర్మాణంతో పాటు సాంకేతిక, నైపుణ్యాభివృద్ధి, లైబ్రరీ, లాబోరేటరీ తదితర అవసరాల నిమిత్తం ఆ నిధులు వెచ్చించనున్నారు. కేంద్ర ప్రభుత్వం కళాశాలకు పీఎం ఉషా నిధులు మంజూరు చేయడం పట్ల కళాశాల అధ్యాపకులు మంగళవారం కేక్‌కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు.

బెల్టు, కల్లు దుకాణాలపై దాడులు



ఖేడ్‌లోని ఎక్సైజ్ కార్యాలయంలో స్వాధీనం చేసుకున్న మద్యంతో ఎక్సైజ్ అధికారులు

నారాయణఖేడ్, మార్చి 19: అక్రమంగా నిర్వహిస్తున్న బెల్టు, కల్లు దుకాణాలపై ఎక్సైజ్ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. మనూరు మండల పరిధిలోని బోరంచలో బెల్టు దుకాణం నిర్వహిస్తున్న గొల్లపల్లి రాములు, బైండ్ల లక్ష్మయ్యలపై కేసు నమోదు చేసి 6.84 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు డీటీఎఫ్ సీఐ శంకర్ తెలిపారు. నిజాంపేట మండలం మునిగేపల్లిలో సాయాగౌడ్ నిర్వహిస్తున్న కల్లు దుకాణంపై దాడిచేసి, 78 లీటర్ల కల్లును ధ్వంసం చేసి, ముగ్గురిని అరెస్టు చేశామన్నారు. ఈ దాడుల్లో ఎస్ఐలు హన్మంతు, అనుదీప్, సిబ్బంది అంజిరెడ్డి, శాంత పాల్గొన్నారు.

ఎక్స్‌కవేటర్ పట్టివేత



ఎక్స్‌కవేటర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తున్న రెవెన్యూ సిబ్బంది

మనోహరాబాద్, మార్చి 19: అక్రమంగా మట్టి తరలిస్తున్న ఎక్స్‌కవేటర్‌ను రెవెన్యూ సిబ్బంది మంగళవారం పట్టుకున్నారు. మండలంలోని కూచారం గ్రామ పరిధి దిల్లాయి తండా టీఎస్ఐఐసీ భూమిలోంచి అక్రమంగా మట్టి తరలిస్తున్నారని సమాచారం రావడంతో రెవెన్యూ అధికారులు వెళ్లి దాడులు చేశారు. ఇంతలో టిప్పర్లు వెళ్లిపోగా.. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఎక్స్‌కవేటర్‌ను, లారీని సీజ్‌చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

బిల్లుల చెల్లింపులో జాప్యం వల్లే పురోగతి లేదు

- డీఈవో వివరణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి), మార్చి 19: 'మనఊరు-మనబడి' కార్యక్రమంలో చేపట్టిన పనులకు సంబంధించి పెండింగ్ బిల్లుల చెల్లింపులో జాప్యం వల్లే పురోగతి కనిపించడం లేదని జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. 'మొక్కుబడిగా' శీర్షికన ఈ నెల 15న ఆంధ్రజ్యోతిలో వచ్చిన వార్తకు స్పందించిన ఆయన మంగళవారం వివరణ ఇచ్చారు. ఏజెన్సీలు పేర్కొన్న విధంగా 'మనఊరు-మనబడి' కార్యక్రమం పనులు త్వరలోనే పూర్తి చేస్తామని వెంకటేశ్వర్లు వివరించారు.

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య



శ్రీకాంత్‌రెడ్డి (ఫైల్)

చేగుంట, మార్చి 19: మద్యానికి బానిసైన యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నార్సింగి ఎస్ఐ అహ్మద్ మొహినుద్దీన్, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నార్సింగి గ్రామానికి చెందిన గౌరీగారి శ్రీకాంత్‌రెడ్డి(26), రిషిత భార్యాభర్తలు. అయితే సంవత్సరం నుంచి శ్రీకాంత్‌రెడ్డి మద్యానికి బానిసై భార్యను శారీరకంగా వేధించడంతో ఆమె రెండునెలల క్రితం ఇద్దరు పిల్లలతో కలిసి తల్లిగారి ఇంటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపం చెందిన శ్రీరాంత్‌రెడ్డి ఇంట్లో తాడుతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ వెల్లడించారు.

15 క్వింటాళ్ల రేషన్ బియ్యం సీజ్



పట్టుబడిన రేషన్ బియ్యం

శివ్వంపేట, మార్చి 19: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులు మంగళవారం పట్టుకున్నారు. మండల పరిధిలోని రెడ్యా తండా వద్ద సేకరించిన 15 క్వింటాళ్ల బియ్యాన్ని ఆటోలో తరలించేందుకు సిద్ధంగా ఉంచారు. నమ్మదగిన సమాచారం, తహసీల్దార్ శ్రీనివాస్ చారి ఆదేశాల మేరకు ఆర్ఐలు కిషన్, సునీల్ అక్కడికి చేరుకుని ఆటోలో ఉన్న బియ్యాన్ని స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు.

ఆర్డీవో క్వార్టర్‌లో బోరు మోటార్ చోరీ

నర్సాపూర్, మార్చి 19: నర్సాపూర్ పట్టణంలోని మండల పరిషత్ ప్రాంగణంలో ఉన్న ఆర్డీవో క్వార్టర్‌లో ఉన్న బోరు మోటారు చోరీకి గురైంది. ప్రస్తుతం ఆ క్వార్టర్‌లో ఎవరూ ఉండడం లేదు. కొత్తగా ఆర్డీవోగా జయప్రకాష్‌రెడ్డి ఈ మధ్యలోనే బాధ్యతలు చేపట్టారు. కాగా పార్లమెంట్ ఎన్నికలు ఉండడంతో క్వార్టర్‌ను వినియోగించుకునేందుకు మండల రెవెన్యూ సిబ్బంది వెళ్లి చూడగా.. అక్కడున్న బోరు మోటారు కనిపించలేదు. చోరీకి గురైందని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అధికారులూ.. తీరు మార్చుకోకపోతే చర్యలే

● సిర్గాపూర్ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే ఆగ్రహం


సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

కల్హేర్/సిర్గాపూర్, మార్చి 19: సిర్గాపూర్ తహసీల్ కార్యాలయంలో డబ్బులు ఇవ్వనిదే ఏ పని కూడా జరగడం లేదని ప్రజల నుంచి తనకు ఫిర్యాదులు వస్తున్నాయని, తీరు మార్చుకోకపోతే కలెక్టర్‌ను తీసుకు వచ్చి బండారం బయట పెడతానని ఖేడ్ ఎమ్మెల్యే పి. సంజీవ రెడ్డి హెచ్చరించారు. మంగళవారం ఎంపీపీ జారా మహిపాల్‌రెడ్డి అధ్యక్షతన సిర్గాపూర్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో నాయకుల అండతో ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి పెరిగిపోయిందని, అధికారులు, నాయకులు ప్రజలను దోచుకున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. ధరణి సమస్యలు, విద్యార్థుల సర్టిఫికెట్లు, కల్యాణ లక్ష్మి, మంజూరు తదితర పనులకు సంబంధించి సిర్గాపూర్ తహసీల్ కార్యాలయానికి వచ్చే ప్రతీ ఒక్కరి నుంచి డబ్బు వసూలు చేస్తున్నారని తనకు ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చాయని ఎమ్మెల్యే వెల్లడించారు. ప్రజలను ఇబ్బంది పెట్టి డబ్బులు దండుకోవడం అవసరమా అని సభకు వచ్చిన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మధును ఎమ్మెల్యే ప్రశ్నించారు. పద్ధతి మార్చుకోకుంటే జిల్లా కలెక్టర్‌ను స్వయంగా కార్యాలయానికి తీసుకు వచ్చి బహిరంగ విచారణ జరిపి బాధ్యులైనవారిపై చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హెచ్చరించారు. వేసవి కాలం సమీపించినందున తాగు నీటికి ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహారంపై అవగాహన కల్పించాలన్నారు. వైద్య సహాయం ప్రజలకు అందించడంలో ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వేసవి కాలంలో వ్యవసాయానికి, తాగు నీటి అవసరాలకు ఎక్కడా విద్యుత్ సమస్య రాకుండా చూసుకోవాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ ప్రయాగబాయి, ఎంపీడీవో మల్సూర్, సిర్గాపూర్ ఎంపీటీసీ పీరప్ప, అధికారులు, పంచాయతీ ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

పనులు పూర్తి కాకుండానే నివేదికలా?

● అల్లాదుర్గం మండల సర్వసభ్య సమావేశంలో పల్లె ప్రగతి పనులపై సభ్యుల మండిపాటు



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

అల్లాదుర్గం, మార్చి 19: పల్లె ప్రగతి ద్వారా గత ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో చేపట్టిన విద్యుత్ పనులు పూర్తి కాకుండానే అవి పూర్తయినట్లు నివేదికలు ఎలా ఇచ్చారంటూ ట్రాన్స్‌కో అధికారులపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం అల్లాదుర్గం మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ అనీల్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో దక్షిణ మధ్య రైల్వే జోన్ కమిటీ సభ్యుడు కాశీనాథ్ మాట్లాడుతూ.. మండలంలోని పలు గ్రామాల్లోని విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం గత ప్రభుత్వం పల్లెప్రగతి ద్వారా నిధులు మంజూరు చేసిందన్నారు. అయితే ఏ గ్రామంలోనూ పనులు పూర్తి చేయకుండానే పూర్తయినట్లు నివేదికలు రూపొందించడం ఏమిటంటూ అధికారుల పై ఆగ్రహం వ్యక్తం చేశారు. సదరు పనులకు సంబంధించి పూర్తి వివరాలను అందించాలని డిమాండ్ చేశారు. ఇనుప స్తంభాలతో విద్యుత్ ప్రమాదాలకు అవకాశాలున్నందున గ్రామాల్లోని ఇనుప స్తంభాలను తొలగించి వాటి స్థానంలో సిమెంట్ స్తంభాలు వేయాలని ప్రభుత్వం గ్రామజ్యోతి కార్యక్రమంలో ఆదేశించినప్పటికీ నేటికీ పలు చోట్ల ఇనుప స్తంభాలే ఉండటం ఏమిటని తహసీల్దార్ సతీష్‌కుమార్ ట్రాన్స్‌కో అధికారులను ప్రశ్నించారు. మండల సర్వసభ్య సమావేశానికి స్థానిక పశువైద్యాధికారులు హాజరు కావడం లేదని, తమ పదవీకాలం పూర్తి అయ్యేనాటికన్నా ఆ శాఖ అధికారులు హాజరవుతారా అంటూ ఎంపీపీ అనీల్ కుమార్‌రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో చేపడుతున్న పనులను పార్టీ నాయకులు ప్రారంభించడం ఏమిటని, ఈ పనుల ప్రారంభోత్సవానికి ప్రొటోకాల్ ఎందుకు పాటించడం లేదని ఎంపీటీసీ దశరథ్ అధికారుల పై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో ఎంపీడీవో శంకర్ యాదవ్, ఆయా శాఖల అధికారులు విజయ్‌గౌడ్, తిలక్‌రాజ్, రఘునాథ్, ఎంపీటీసీ సభ్యులు విఠల్‌రెడ్డి, స్వరూప, దుర్గయ్య, దశరత్ తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



మండల కేంద్రంలో ప్రధాన రహదారులపై గల పెద్ద చెట్ల కొమ్మలు తరచూ విద్యుత్ వైర్లకు తగులుతూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. తాజాగా మంగళవారం శివ్వంపేటలోని భారత్ గ్యాస్ గోదాం ఎదురుగా గల భారీ చెట్టు కొమ్మలు విద్యుత్ తీగలకు తగలడంతో షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగి స్థానికులు, వాహనదారులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. విద్యుత్ అధికారులు ఇప్పటికైనా స్పందించి రోడ్ల పక్కన విద్యుత్‌తీగలకు తగులుతున్న చెట్ల కొమ్మలను వెంటనే తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. - శివ్వంపేట మార్చి 19

ప్రైవేట్ బ్యాంకు సిబ్బందిపై దాడి.. కేసు నమోదు

శివ్వంపేట, మార్చి 19: ఈఎంఐ చెల్లించలేదని ప్రైవేటు బ్యాంకు సిబ్బంది ట్రాక్టర్‌ను తీసుకెళ్తుండగా వారిపై దాడి చేసిన ఘటన మండలంలోని వెంకయ్య తండాలో మంగళవారం చోటు చేసుకున్నది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని రెడ్యాతండా పంచాయతీ వెంకయ్యతండాకు చెందిన బానోత్ తుకారాం సంగారెడ్డిలోని ఓ ప్రైవేటు బ్యాంకు నుంచి ట్రాక్టర్ కోసం అప్పు తీసుకున్నాడు. కాగా ప్రతి నెలా చెల్లించాల్సిన వాయిదాలు రూ.1.14లక్షల బకాయి కట్టకపోవడంతో మంగళవారం బ్యాంకు సిబ్బంది తండాకు వచ్చి ట్రాక్టర్‌ను తీసుకెళ్లెందుకు సిద్ధమయ్యారు. సంబంధిత యజమాని లేకుండా ఎలా తీసుకెళ్తారంటూ స్థానికులు బ్యాంకు సిబ్బందిపై ట్రాక్టర్ యజమాని కుమారుడితో పాటు మరికొందరు దాడి చేశారు. ఈ ఘటనలో సిబ్బంది సందీప్‌గౌడ్, సందీప్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, దత్తయ్యలకు గాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి తెలిపారు.

చింత చెట్టుకు నిప్పు.. మంటలు ఆర్పిన అగ్నిమాపక సిబ్బంది

అల్లాదుర్గం, మార్చి 19: మండలంలోని గడిపెద్దాపూర్‌లో సోమవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చింత చెట్టుకు నిప్పు పెట్టారని గ్రామస్థులు తెలిపారు. గ్రామంలోని హనుమాన్ ఆలయం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మధ్యన ఉన్న భారీ వృక్షం నుంచి మంటలు వ్యాపిస్తుండటంతో మంగళవారం తెల్లవారుజామున స్థానికులు గమనించి మంటలను ఆర్పేందుకు యత్నించినా ఫలితం లేకపోయింది. వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని ఈ మంటలను ఆర్పడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

బొరంచ నల్ల పోచమ్మ హుండీ ఆదాయం రూ.7.71 లక్షలు

మనూరు, మార్చి 19: బొరంచ నల్ల పోచమ్మ ఆలయ హుండీని మంగళవారం లెక్కించారు. రూ.7,71,618 ఆదాయం వచ్చినట్లు ఈవో మోహన్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మనూరు ఏఎస్‌ఐ అమిర్యానాయక్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఎంపీ బీబీ పాటిల్ సమక్షంలో బీజేపీలో చేరిన అరవింద్‌రెడ్డి

రేగోడు, మార్చి 19: జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ సమక్షంలో రేగోడు బీఆర్‌ఎస్ మాజీ అధ్యక్షుడు అరవింద్ రెడ్డి బీజేపీలో చేరారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఎంపీ నివాసంలో నియోజకవర్గంలోని పలువురు నాయకులతో కలిసి బీజేపీలో చేరారు. అరవింద్‌రెడ్డి స్వగ్రామం గజవాడ కాగా గతంలో జడ్పీటీసీగా పోటీ చేసి స్వల్ప మెజార్టీతో ఓడిపోయారు. అరవింద్ రెడ్డి రాకతో రేగోడు మండల బీజేపీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నెలకొంది.

కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ

నారాయణఖేడ్, మార్చి 19: ఖేడ్‌లోని ఆర్డీవో కార్యాలయం పక్కనున్న పాత ఐకేపీ కార్యాలయంలో తెలంగాణ కంప్యూటర్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు శిక్షణ కేంద్రం ఇన్‌ఛార్జి జైపాల్ మంగళవారం ఒకప్రకటనలో తెలిపారు. ఈ నెల 21 నుంచి శిక్షణ ప్రారంభమవుతుందని, ఆసక్తి గల విద్యార్థులు 7036255867, 9573398748, 7569688627 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

విద్యార్థులకు రాగిజావ పంపిణీ

సంగారెడ్డి రూరల్, మార్చి 19: విద్యార్థుల ఆరోగ్యం కోసం సత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ ఆధ్వర్యంలో రాగిజావ పంపిణీని మంగళవారం సంగారెడ్డిలో బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు చింత సాయినాథ్ ప్రారంభించారు. బాల, బాలికలు రుచి, శుచితో కూడిన రాగి జావ సేవించడం వల్ల పోషకాలు మెండుగా పెరుగుతాయని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం నర్సింహ్మగౌడ్, మల్లికార్జున్, సుధాకర్, సదాశివపేట కిరాణ వర్తక సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రెస్ క్లబ్ కార్యవర్గం ఎన్నిక

రాయికోడ్, మార్చి 19: మండల ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్‌ను మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఒగ్గు విఠల్, ఉపాధ్యక్షులుగా ఎస్.పండరి, ప్రశాంత్, గౌరవ అధ్యక్షుడిగా కె.పెంటయ్య, ప్రధాన కార్యదర్శిగా కె.శంకర్, సహాయ కార్యదర్శిగా సాయిరాం, కోశాధికారిగా విఠల్ రావు కులకర్ణి, సలహాదారులుగా టి.రాములు, జీ.గోపాల్, కార్యవర్గ సభ్యులుగా హన్మంతు, రాజ్‌కుమార్, బాబురావు ఎన్నికయ్యారు.

పనుల్లో నాణ్యత పాటించాలి

జిన్నారం, మార్చి 19: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించి, సకాలంలో పనులు పూర్తి చేయాలని బొల్లారం మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి అన్నారు. మంగళవారం మున్సిపాలిటీలోని 7వ వార్డులో చేపట్టిన భూగర్భ డ్రైనేజీ పనులను రోజారాణి పరిశీలించారు. కాంట్రాక్టర్లు మున్సిపాలిటీలో చేపట్టే అభివృద్ధి పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.

స్వీయ అవగాహనతో ఎయిడ్స్ వ్యాప్తికి అడ్డుకట్ట



సదస్సులో వక్తలు

పటాన్‌చెరు రూరల్, మార్చి 19: ప్రతీ ఒక్కరి స్వీయ అవగాహనే హెచ్‌ఐవీ, ఎయిడ్స్ వ్యాప్తిని అరికడుతుందని వక్తలు అభిప్రాయపడ్డారు. తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంఘం (టీఎస్‌ఏసీఎస్) మంగళవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్‌లో జీవ నైపుణ్యాల ద్వారా హెచ్‌ఐవీ నివారణపై ఒకరోజు సదస్సును నిర్వహించింది. గీతంలోని జాతీయ సేవాపథకం(ఎన్‌ఎస్‌ఎస్) సౌజన్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రెడ్ రిబ్బన్ క్లబ్ ముఖ్య నాయకులు పాల్గొన్నారు. టీఎస్‌ఏసీఎస్ అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ పినపాటి ప్రసాద్, కాకతీయ విశ్వవిద్యాలయం డీన్ ప్రొఫెసర్ పింగళి నరసింహారావు, టీఎస్ ఏసీఎస్ సంయుక్త డైరెక్టర్ డాక్టర్ చంద్రారెడ్డి, రిటైర్డ్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ టీఎన్ స్వామి, అసిస్టెంట్ డైరెక్టర్ జి.రమేష్, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ ఆర్ వర్మ తదితరులు పాల్గొని, లెఫ్ట్ స్కిల్స్ ద్వారా హెచ్‌ఐవీ నివారణ యొక్క ప్రాముఖ్యతను వివరించారు. తెలంగాణలోని హెచ్‌ఐవీ కేసుల భయంకరమైన గణాంకాలను ఈ సందర్భంగా వారు ప్రస్తావించారు. స్వీయ అవగాహన, సమస్య పరిష్కారం, నిర్ణయం తీసుకోవడం, విమర్శనాత్మక ఆలోచన, భావ ప్రకటన, భావోద్వేగం, ఒత్తిడిని అధిగమించడంతో సహా హెచ్‌ఐవీ నివారణలో సహాయ పడే పది ముఖ్యమైన జీవన నైపుణ్యాలను నిపుణులు వివరించారు. హెచ్‌ఐవీ వ్యాప్తి చెందే వివిధ మార్గాలు, వ్యక్తులపై దాని ప్రభావాన్ని కూడా చర్చించారు. సవాళ్లను అధిగమించే దానికి, జీవన నైపుణ్యాలను ఉపయోగించుకునేలా హెచ్‌ఐవీ సోకిన వ్యక్తులను వక్తలు ప్రోత్సహించారు. ఈ సందర్భంగా వక్తృత్వ పోటీ నిర్వహించి విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. తొలుత, ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్త నాగేంద్రకుమార్ అతిథులను స్వాగతించారు. ఇతర సమన్వయకర్తలు, పలువురు విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రముఖ కళాకారిణి నృత్య ప్రదర్శన

గీతం యూనివర్సిటీలో ప్రముఖ కళాకారిణి డాక్టర్ నీనా ప్రసాద్ మోహినియాట్టం నృత్య ప్రదర్శన ఆహూతులను అలరించింది. ఈ ప్రదర్శనను స్పిక్ మెకే హెరిటేజ్ క్లబ్ సహకారంతో స్టూడెంట్ లెఫ్ట్ డైరెక్టరేట్ నిర్వహించింది. గురువుకు నివాళిగా చొల్కెట్టుతో శాస్త్రీయ నృత్య ప్రదర్శనతో ప్రారంభమైంది. తర్వాత వసుంధర సుందర ధార భూమి ప్రదర్శన గాత్రానికి తగ్గ అభినయంతో అలరించింది. ఆ తరువాత ప్రతిభా తే రచించిన పద వర్ణనతో కొనసాగి, తిల్లానాతో ముగిసింది. ప్రదర్శన ఆద్యంతం ప్రేక్షకులను ఆనంద డోలికల్లో ముంచేసింది.. మాధవన్ సంపూత్రి సీపీ (గానం), రమేష్ బాబు కేపీ (మృదంగం), అరుణ్‌దాస్ సీపీ(ఇడక్క), కోలంక సాయికుమార్ (వయోలిన్) తదితరులు డాక్టర్ నీనా ప్రసాద్‌కు సహకారం అందించారు. మోహినియాట్టం పారాయణం వంటి కార్యక్రమాల ద్వారా మనదేశం యొక్క గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని ప్రచారం చేయడం గీతం, హైదరాబాద్ కొనసాగిస్తోంది.


తూప్రాన్ మండల పరిషత్ సమావేశం

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం

● ఎన్నికల కోడ్‌తో చర్చలకు దూరం

తూప్రాన్, మార్చి 19: తూప్రాన్ మండల పరిషత్ సమావేశం మంగళవారం వైస్ ఎంపీపీ ఉమ్మన్నగారి శరణ్యభాస్కర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో సాదాసీదాగా చర్చల్లేకుండానే సమావేశం నిర్వహించారు. సమావేశానికి అధికారులు కూడా అంతంత మాత్రంగానే హాజరయ్యారు. ఎంపీపీ కార్యాలయ గదిలో సమావేశం నిర్వహించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషక మాసోత్సవం నిర్వహించారు. ఎంపీడీవో వెంకటేశ్వర్ రెడ్డి, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నార్సింగిలో భద్రతాబలగాల ఫ్లాగ్‌మార్చ్


నార్సింగిలో కేంద్ర భద్రతా బలగాలతో పోలీసుల కవాతు

చేగుంట, మార్చి 19: నార్సింగి మండల కేంద్రంలో రామాయంపేట సీఐ వెంకటేశ్, నార్సింగ్ ఎస్‌ఐ అహ్మద్ మొయినొద్దీన్ ఆధ్వర్యంలో మంగళవారం నార్సింగి పట్టణంలోని పలు వీధుల్లో కేంద్ర పోలీస్ బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ వెంకటేశ్ మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ప్రజల్లో భరోసా కల్పించేందుకే ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరుపుకునేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, ప్రజలు స్వచ్ఛందంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

చేగుంట తైబజార్ వేలం వాయిదా

చేగుంట,మార్చి 19: చేగుంట గ్రామపంచాయతీ తైబజార్ వేలంపాట మంగళవారం గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి గీయాఉన్నిసా బేగం ఆధ్వర్యంలో నిర్వహించారు. వేలం పాటలో నలుగురు సభ్యులు 50 వేల చొప్పున డిపాజిట్ చేసి వేలంపాటలో పాల్గొన్నారు. వేలం పాట రూ.15.35 లక్షలు పలుకగా గత ఏడాది కంటే తక్కువ ధర రావడంతో వాయిదా వేసినట్టు ఆమె తెలిపారు. తిరిగి బుధవారం 10 గంటలకు గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో వేలం పాట నిర్వహించనున్నట్టు ప్రత్యేక అధికారి వెల్లడించారు.

కొండాపూర్‌లో పంచాయతీ కార్యదర్శుల నిరసన


నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న కార్యదర్శులు

కొండాపూర్, మార్చి 19: నాగర్ కర్నూల్ జిల్లా కోడేరు మండలంలో ఎంపీవోపై ఎంపీపీ దాడి చేయడాన్ని తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల ఫెడరేషన్ సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండల యూనియన్ తీవ్రంగా ఖండించింది. మంగళవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయం ముందు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతూ దాడిని తీవ్రంగా ఖండించారు. దాడికి పాల్పడిన ఎంపీపీని శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీపీఎస్‌ఎఫ్ మండల అధ్యక్షుడు కిషోర్ పవర్, ఉపాధ్యక్షులు వనజ, కోశాధికారి లోకేష్, రజినీ, వివిధ గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రజల్లో కాంగ్రెస్‌కు ఆదరణ: ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, మార్చి 19: కాంగ్రెస్‌పార్టీ ప్రభుత్వ పాలన, చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ప్రజల్లో రోజురోజుకూ ఆదరణ పెరుగుతుందని స్థానిక ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని సత్యగామ, పెద్దశంకరంపేట మండలం కొత్తపేట, సంగారెడ్డిపేట గ్రామాలకు చెందిన దాదాపు 250 మంది బీఆర్‌ఎస్ నాయకులు సోమవారం రాత్రి ఖేడ్‌లోని ఎమ్మెల్యే స్వగృహం ఆవరణలో కాంగ్రెస్‌పార్టీలో చేరారు. వారికి ఆయన కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో కొత్తపల్లి మాజీ సర్పంచులు అనంతరావు, ఆగమయ్య సత్యగామ మాజీ ఉప సర్పంచు విఠల్‌తో పాటు పలువురు మాజీ వార్డు సభ్యులు, నాయకులు ఉన్నారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, ఖేడ్ పీఏసీఎస్ చైర్మన్ శోభ అశోక్‌రెడ్డి, న్యాయవాది బోజిరెడ్డి, మండలకాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పార్టీ గేట్లు కాదు.. హామీల గేట్లు తెరవండి: ఎమ్మెల్యే చింతా


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి రూరల్, మార్చి 19: సీఎం రేవంత్‌రెడ్డి మా పార్టీ గేట్లు ఎత్తితే ఖాళీ అవుతుందంటున్నారని ముందు ఎత్తాల్సింది పార్టీ గేట్లు కాదని ప్రజలకు ఇచ్చిన హామీల గేట్లు తెరవాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. సంగారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎవరైనా తన పదవికి, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేయకుండా పార్టీ మారితో రాళ్లతో కొట్టి చంపాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారని, ఇప్పుడు ఎవరిని రాళ్లతో కొట్టాలో ఆయనే చెప్పాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చిందని, అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో వ్యతిరేకత ప్రారంభమైందన్నారు. ఇప్పటి వరకు అమలు చేసిన ఆరు గ్యారంటీలు అమలు చేశామని గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ పెద్దలు ఏ ఒక్క హామీని సక్రమంగా అమలు చేయలేదని విమర్శించారు. మహిళలకు ఉచిత బస్సు కల్పించి ఆటో కార్మికులను రోడ్డున పడేశారని ఆవేదన వ్యక్తం చేశారు. గృహజ్యోతికి అర్హులైనా జీరో బిల్లులు రావడం లేదని, అలాగే మహాలక్ష్మి పథకం, రైతు భరోసా, కౌలు రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.

గీతా మందిరం వార్షికోత్సవాలు


గీతామందిరంలో కలశపూజ నిర్వహిస్తున్న భక్తులు

తూప్రాన్, మార్చి 19: సంపాదన అనేది ధర్మబద్ధంగా ఉండాలని తొగుట పీఠాధిపతి పరమహంస పరివ్రాజకాచార్య మాధవానందస్వామి పేర్కొన్నారు. మంగళవారం తూప్రాన్ పట్టణంలోని గీతామందిరంలో నిర్వహించిన 16వ వార్షికోత్సవానికి హాజరయ్యారు. కార్యక్రమంలో మాధవానందస్వామికి పాదుకాపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి పూజ, స్వస్తివాచనం, యాగశాల ప్రవేశం, సర్వతో భద్ర మండల దేవతాహ్వానం, ప్రధాన కలశ స్థాపన, శ్రీగోపాలస్వామికి మహాభిషేకం, గణపతి, పురుషసూక్త, శ్రీసూక్త, మన్యుసూక్త, రుద్రహోమాలు, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం శ్రీరుక్మిణీకృష్ణస్వామి కల్యాణం, తీర్థప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు చేపట్టారు.

పదోతరగతి పరీక్షలను పరిశీలించిన అదనపు కలెక్టర్

నర్సాపూర్, మార్చి 19: పదోతరగతి పరీక్షలు మంగళవారం రెండవరోజు ప్రశాంతంగా ముగిశాయి. జిల్లా అదనపు కలెక్టర్ రమేష్ నర్సాపూర్‌లోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పరీక్షా కేంద్రాన్ని సందర్శించి పరిశీలించారు. అదేవిధంగా ఆర్డీవో జయప్రకాష్ రెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పరీక్షాకేంద్రాన్ని సందర్శించి, పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు.


నర్సాపూర్ జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించిన అదనపుకలెక్టర్

ఉద్యమాలకు బాటలు వేసిన మల్లు స్వరాజ్యం


మల్లుస్వరాజ్యం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

సంగారెడ్డి రూరల్, మార్చి 19: ప్రజా ఉద్యమాలకు బాటలు వేసిన మహనీయులు మల్లు స్వరాజ్యమని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్ పేర్కొన్నారు. మల్లు స్వరాజ్యం వర్ధంతి సందర్భంగా మంగళవారం సంగారెడ్డిలోని కేవల్ కిషన్‌భవన్‌లో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్యూనిస్టు సిద్ధాంతాలను దృఢంగా నమ్మి, రెండు సార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించి ప్రజా సమస్యలపై తనదైన శైలిలో పరిష్కరించారన్నారు. ఆమె పోరాట స్ఫూర్తితో నేటి యువత ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మాణిక్యం, నాయకులు ఉన్నారు.

కార్మిక వ్యతిరేక లేబర్‌కోడ్‌లను రద్దుచేయాలి

● సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మల్లేశం

జహీరాబాద్, మార్చి 19: కేంద్రప్రభుత్వం తీసుకువచ్చిన కార్మిక వ్యతిరేక లేబర్‌కోడ్‌లను రద్దుచేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మల్లేశం పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని శ్రామికభవన్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో కార్యకర్తలతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గతంలో రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం కాలపరిమితి ముగిసిన జీవోలను నిర్లక్ష్యం చేయగా, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుతం తెచ్చిన జీవోలతో ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. ప్రస్తుతం వాటిని సవరించి కార్మికులకు కనీసవేతనం కింద రూ.26వేలు ఇచ్చేలా చూడాలన్నారు. లేబర్‌కోడ్‌లను, జీవోలను రద్దు చేయకపోతే సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికుల పక్షాన పోరాటాలను ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో సీఐటీయు జిల్లా నాయకులు మైపాల్, వివిధ యూనియన్ల నాయకులు ఉన్నారు.

బీజేపీ ఎంపీ అభ్యర్థిని కలిసిన నాయకులు


రఘునందన్‌రావు సన్మానిస్తున్న మనోహరాబాద్ బీజేపీ నాయకులు

మనోహరాబాద్/కొల్చారం, మార్చి19: మెదక్ ఎంపీగా బీజేపీ తరఫున పోటీ చేస్తున్న దుబ్బాక మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావును మనోహరాబాద్ బీజేపీ నాయకులు, కొల్చారం మండల బీజేపీ నాయకులు వేర్వేరుగా మంగళవారం కలిసి సన్మానించారు. రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం మాజీ ఉపాధ్యక్షుడు నత్తి మల్లేష్ ముదిరాజ్, రాష్ట్ర ముదిరాజ్ సంఘం నాయకుడు చంద్రశేఖర్ ముదిరాజ్ మంగళవారం మర్యాద పూర్వకంగా రఘునందన్‌రావును కలసి అభినందనలు తెలిపారు. కలిసినవారిలో మాజీ సర్పంచ్ నరేందర్‌రెడ్డి, నాగరాజు, బాలక్రిష్ణ పాల్గొన్నారు. అదేవిధంగా కొల్చారం మండల బీజేపీ అధ్యక్షుడు పాతూరి దయాకర్‌గౌడ్, కౌడిపల్లి మండల బీజేపీ అధ్యక్షుడు కాజిపేట రాకేష్, నర్సాపూర్ టౌన్ అధ్యక్షుడు అంజనేయిలు గౌడ్, హత్నూర మండల బీజేపీ అధ్యక్షుడు నాగప్రభుగౌడ్, వెల్దుర్తి మండల అధ్యక్షుడు నర్సింహులు, చిలప్‌చెడ్ మండల అధ్యక్షుడు దశరథ్, నర్సాపూర్ రూరల్ అధ్యక్షుడు నగేష్ రఘునందన్‌రావును కలిసినవారిలో ఉన్నారు.

ఘనంగా ఇబ్రహీంపూర్‌లో పోచమ్మ జాతర


పోచమ్మ ఆలయం చుట్టూ బోనాలతో ప్రదక్షిణ చేస్తున్న మహిళలు

మునిపల్లి, మార్చి19 : మండలంలోని ఇబ్రహీంపూర్‌లో పోచమ్మ జాతరను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పుర వీధుల గుండా మహిళలు బోనాలను ఎత్తుకొని ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు నాగన్న, అంజయ్య, ప్రభు, రాములు గౌడ్, చంద్రయ్య, మల్లేశం, క్రిష్ణ, పాండు గౌడ్, మహేష్ గౌడ్, అశోక్, లక్ష్మణ్ గౌడ్, నర్సింహులు గౌడ్, అంజయ్య గౌడ్, రత్నయ్య, గులామొద్దీన్, గూడుసాబ్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన కోసమే పోషణ్ పక్వాడ


కల్హేర్‌లో పోషకాహారంపై అవగాహన కార్యక్రమం



చేగుంట: రెడ్డిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ కిట్లను పంపిణీ చేస్తున్న జీఎంఆర్ సంస్థ


చిన్నశంకరంపేట: గవ్వలపల్లిలో పౌష్టికాహారం తీసుకుంటామని ప్రతిజ్ఞ చేస్తున్న గర్భిణులు

కల్హేర్, మార్చి 19: ప్రజలకు పోషకాహారంపై అవగాహన కోసమే ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కల్హేర్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీల పేర్కొన్నారు. మంగళవారం కల్హేర్‌లోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో పోషకాహారంపై అవగాహన, పోషకాహార పదార్థాల ప్రదర్శన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చాలా మంది చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలు పోషకాహార లోపంతో బాధపడుతున్నారని, అందువల్ల ప్రతీ అంగన్‌వాడీలో హాజరయ్యేవారికి నిత్యం పోషకాహారం అందిస్తున్నట్టు చెప్పారు. అనంతరం పోషక వారోత్సవాల సందర్భంగా ర్యాలీ నిర్వహించి, పోషక పదార్థాల ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో సీనియర్ కార్యకర్తలు శోభారాణి, నాగమణి, నాగలక్ష్మి, పద్మ, ప్రభావతి, స్వప్న, రుక్మిణి, అమృత, మణెమ్మ, సునిత, భారతి, లక్ష్మి పాల్గొన్నారు.

● **మనూరు:** మండలంలోని వివిధ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు పిల్లలకు చదువుతో పాటు గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం, ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ యమున పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని శెల్గిరాలో పోషన్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, వీణకుమారి, సుజాత, శకుంతల, తదితరులు పాల్గొన్నారు.

● **చేగుంట:** చేగుంట మండలం రెడ్డిపల్లి గ్రామంలో జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షైనీ సువర్ణ మాట్లాడుతూ జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ సెంటర్లలో పోషకాహార కిట్లు అందించడాన్ని అభినందించారు. కార్యక్రమంలో జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ప్రతినిధి శ్రీనివాస్, అంగన్‌వాడీ టీచర్లు సురేఖ, బాలలక్ష్మి పాల్గొన్నారు.

● **చిన్నశంకటరంపేట:** గవ్వలపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు పోషకాహారంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. చిరు ధాన్యాలు తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. అనంతరం గర్భిణులకు సీమంతంతో పాటు 6 నెలలు నిండిన బాబుకు అన్నప్రాశన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గవ్వలపల్లి సెక్టార్ సూపర్‌వైజర్ భారతి, అంగన్‌వాడీ సెంటర్ లక్ష్మి, శారద, శివలక్ష్మి, హెల్పర్లు, బాలికలు తదితరులు పాల్గొన్నారు.